క్లుప్తంగా

వరిలో ఎండాకు తెగులు



పెద్దగోపతిలో వరి దబ్బులు పరిశీలిస్తున్న ఏడీ బాలాజీ

కొణిజర్ల: వరిపంటకు ఎండాకు తెగులు ఉధృతి అధికంగా ఉందని ఏడీ డి.బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దగోపతిలో వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అధికంగా యూరియా వాడటం, మురుగునీరు బయటకు వెళ్లకుండా నిల్వ ఉండడంతో బ్యాక్టీరియా ఎండుతెగులు వచ్చిందన్నారు. దీని నివారణకు యూరియా వాడకాన్ని పూర్తిగా నిలిపివేసి, అగ్రోమైసిన్ 0.4 గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

తల్లాడ: తల్లాడ తహసీల్దార్ వి.రవికుమార్ సోమవారం బదిలీపై ఖమ్మం అర్బన్‌కు వెళ్లారు. రవికుమార్ 2023 ఆగస్టు 4 నుంచి నేటి వరకు 14 నెలల పాటు పని చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిటీ వనజను నియమించారు. ప్రస్తుతం ఆమె మూడురోజులు సెలవులో ఉండడంతో కల్లూరు తహసీల్దార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

బాధ్యతలు స్వీకరణ

ముదిగొండ ఏడీఈగా రామకృష్ణారావు ..



ఏడీఈకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఏఈలు, సిబ్బంది

ముదిగొండ: ముదిగొండ మండల విద్యుత్ శాఖ ఏడీఈగా బి.రామకృష్ణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైరా ఏడీఈగా పని చేస్తున్న ఆయన ముదిగొండకు బదిలీపై రాగా.. ఇక్కడ పనిచేసిన భీంసింగ్ పెనుబల్లికి బదిలీపై వెళ్లారు. దీంతో రామకృష్ణారావును విద్యుత్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ శాఖలో బదిలీలు

పెనుబల్లి: పెనుబల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. పెనుబల్లి టౌన్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఈగపాటి రమేష్ ఏనుకూరు మండలానికి, పెనుబల్లి రూరల్ లైన్ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్న బి.రాంబాబు సత్తుపల్లి టౌన్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో సత్తుపల్లి సెక్షన్ నుంచి పెనుబల్లి టౌన్ ఎల్ఐగా సత్యనారాయణ, రూరల్ ఎల్ఐగా ప్రసాద్‌లు సోమవారం విధుల్లో చేరారు. అలాగే ఖాళీగా పెనుబల్లి టౌన్ లైన్‌మేన్ పోస్టుకు సత్తుపల్లి టౌన్ నుంచి మెహబుల్ బదిలీ కాగా సోమవారం వీరంతా పెనుబల్లి సెక్షన్ ఏఈ రవితేజకు రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

రాజకీయ జోక్యం తగదు..



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

తల్లాడ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకిచ్చే ఇళ్ల పథకంలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తల్లాడలో.. శీలం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ జోక్యంతో గత పదిహేనేళ్లుగా అర్హులైన పేదలు నష్టపోయారని, ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా వేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాతా బాస్కర్‌రావు, రామలింగేశ్వర్‌రావు, మోహన్ రావు, ఫకీరమ్మ, నరేష్, వెంకటనరసయ్య, కృష్ణయ్య, కృష్ణయ్య, జీవరత్నం, చెన్నయ్య, సైదులు పాల్గొన్నారు.

దరఖాస్తు ఆన్‌లైన్ కాలేదంటున్నారు..

మధిర: తాము గత పదిహేనేళ్లుగా మధిరలోని రాజీవ్‌నగర్ సిద్ధారెడ్డి బజార్, 30వ వార్డులో నివాసం ఉంటున్నామని, రెండేళ్ల నుంచి సిరిపురంలో ఉంటున్నా.. తన భర్త సెలూన్‌షాపు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు అన్నీ ఇక్కడే ఉన్నాయని, తాము ప్రజాపాలన దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ కాలేదని అధికారులు చెబుతున్నారని నాగులవంచ కోటేశ్వరి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. జనవరి 2న మొదటి సారి ప్రజాపాలనలో దరఖాస్తు చేసినా.. గ్యాసు డబ్బులు పడటం లేదు. అధికారులను సంప్రదించగా ఆన్‌లైన్ కాలేదన్నారు. దీంతో మరోమారు మార్చి 15న దరఖాస్తు పెట్టుకున్నా.. ఆన్‌లైన్ కాలేదంటున్నారని బాధితురాలు వాపోయింది.

పత్తి రైతుల వెతలు



బోనకల్‌లో సాగుచేసిన పత్తి చేను

- పెరిగిన ఖర్చులు.. తగ్గిన దిగుబడి
- వర్షపు జల్లులతో దెబ్బతింటున్న పత్తి
- రోజురోజుకు పతనమవుతున్న ధర
- కూలీల కొరతతో రైతుల ఇబ్బంది

బోనకల్: పత్తిపంట సాగుచేసిన రైతులు తెల్లబోతున్నారు. ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడి తగ్గడంతో.. రైతులకు కనీసం గిట్టుబాటు ధర కూడా లభించే పరిస్థితి లేదు. ఇటీవల కురిసిన తుఫాన్లు, భారీ వర్షాలకు పత్తిపంట దెబ్బతిన్నది. పత్తి పూతదశలో వర్షానికి పూతరాలిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో వేలాదిరూపాయలు పెట్టుబడులు వర్షాలకు కొట్టుకుపోయాయి. దీంతో రైతులు తీవ్ర మనోవేధనకు గురయ్యారు. వర్షం తగ్గిన తరువాత రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకుంటే చీడపీడలు ఆశించి దిగుబడి పూర్తిస్థాయిలో తగ్గిపోయింది.

ఆందోళనలో రైతులు..

మండలంలో ఈ ఏడాది 18వేల ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగుచేశారు. ఎకరాకు 10నుంచి15క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం 5నుంచి 6క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి ఏర్పడడంతో పత్తిరైతులు పరేషాన్ అవుతున్నారు.

కూలీల ఇబ్బందులు..

ఇదిలా ఉండగా వచ్చిన పత్తిని తీసేందుకు కూలీల కొరత రైతులను వేదిస్తుంది. ఒకపక్క మబ్బులు చేసి వర్షాలు పడుతుండడంతో వచ్చిన కొద్దిపాటి పత్తిని రక్షించుకునేందుకు అన్నదాతలు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. కూలీలు ఇష్టానుసారంగా రేట్లు పెంచుతుండడంతో ఏం చేయాలో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. పత్తి తీసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వాహనాలలో కూలీలను తీసుకొస్తున్నారు. క్వింటా పత్తి తీసేందుకు రూ.2వేలు ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు.

కూలీల కొరత తీవ్రంగా ఉంది..



నేను పదెకరాల్లో పత్తిపంటను సాగుచేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి తడిచి కలర్ మారడంతో పాటు పత్తి గింజలు కూడా నేలరాలాయి. దీనికి తోడు పత్తి తీసేందుకు కూలీలు దొరక్క ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకురావడంతో ఖర్చులు పెరిగాయి. క్వింటా పత్తి తీయడానికి రూ.2వేలకు పైగా ఖర్చు వస్తుంది.

– లాల్‌బహదూర్ శాస్త్రి, రైతు, ముష్టికుంట్ల

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి..



ప్రభుత్వం పత్తి సీసీఐ కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం మద్దతు ధర రూ.7,520 ఉండగా.. దళారులు క్వింటా రూ.5,500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అసలే కర్చులు పెరిగి.. దిగుబడి తగ్గిందని ఇబ్బంది పడుతుంటే.. కూలీల కొరత ఒకటి. కనీస పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– షేక్ ముస్తాఫా, రైతు, ముష్టికుంట్ల

కొనుగోలు కేంద్రాలు ఏవీ ?

ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి రైతులను నిండా ముంచుతున్నారు. క్వింటాకు రూ.5వేల నుంచి రూ.5,800వరకు విక్రయిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7,520 మద్దతు ధర ప్రకటించినప్పటికీ సీసీఐ కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

భూమి దాత విగ్రహావిష్కరణ



గుత్తా వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో గల శ్రీ కోదండ రామాలయానికి దాత గుత్తా వీరయ్య సుమారు రూ.కోటి విలువ చేసే 3 ఎకరాల భూమిని విరాళంగా అందజేశారు. దాంతో ఆలయ కమిటీ, కుటుంబ సభ్యులు సుమారు రూ.3 లక్షల అంచనా వ్యయంతో ఆలయం ఎదురుగా సింథటిక్‌తో ఏర్పాటు చేసిన గుత్తా వీరయ్య, ఆయన కుమార్తె వెంకట కృష్ణకుమారి విగ్రహాలను ఆదివారం అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని ఆవిష్కరించారు. వీరయ్య, అంజమ్మ దంపతులకు వెంకటకృష్ణకుమారి సంతానం కలిగి ఉంది. చిన్నతనంలోనే తన కూతురు మృతిచెందడంతో.. తనకున్న మూడు ఎకరాల భూమిని ఆలయానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. గత ఆరునెలల క్రితం ఆయన కూడా అనారోగ్యంతో మృతి చెందగా.. భర్త కోరిక మేరకు భార్య భూ పత్రాలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం అంజమ్మను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సాదం రామారావు, గుత్తా వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల్లో..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌బజార్‌లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో మల్లు నందిని పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో పూజలు..

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతి జమలాపురం ఆలయాన్ని సోమవారం మల్లు నందిని సందర్శించగా.. ఆమెకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, వేద పండితులు మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.జగన్మోహన్ రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

నెమలి వేణుగోపాలస్వామి దర్శనం..

వైరారూరల్: తెలంగాణ రాష్ట్ర సరిహద్దు, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో స్వయంభూగా వెలిసిన శ్రీవేణుగోపాల స్వామిని మల్లు నందిని సోమవారం దర్శించుకుని.. పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆమెకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ మహోత్సవం



బాలపేటలో పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

పదునెట్టాంబడికి పూజలు, అభిషేకం

తల్లాడ: మండలంలోని బాలపేట గ్రామంలో ఆదివారం రాత్రి వైభవంగా మహా పడిపూజ మహోత్సవం నిర్వహించారు. పులి కృష్ణయ్య 18వ పడి సందర్భంగా ఆంజనేయం స్వామి దేవాలయం వద్ద పడి పూజ ఏర్పాటు చేశారు. వైరా అయ్యప్ప దేవాలయం ప్రధాన అర్చకుడు రామక్రిష్ణ శర్మ ఆధ్వర్యంలో పదునెట్టాంబడి(18మెట్లు) నిర్మించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పంచామృతాలు, నవరసాలతో అభిషేక పూజలు జరిగాయి. కోదాడకు చెందిన బాస్కర్ బృందంచే ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. ఈ పడిపూజలకు అనేకమంది మాలధారులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో పులి మహేంద్రబాబు, కిరణ్మయి, కృష్ణయ్య, శ్రీనివాసరావు, నరసింహారావు పాల్గొన్నారు.

శివలింగానికి అన్నాభిషేకం..



అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కల్పతరురోడ్ విశ్వజ్ఞాన పీఠంలో సోమవారం శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించారు. ముందుగా ఛండీ హోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు రవిశాస్త్రీ, గణేష్‌రెడ్డి, ఏసీపీ ఎన్.వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామానికి చెందిన మొగిలి గోపయ్య, వీరస్వామి, వెంకమ్మ, కృష్ణ వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి స్థలం హద్దు రాళ్ల విషయంలో గ్రామానికి చెందిన కొమ్ము వెంకటమ్మతో ఆ నలుగురు వ్యక్తులు గొడవపడి ఆమెను కొట్టి గాయపరచటమే కాకుండా చంపుతామని బెదిరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నేటినుంచి పశువులకు టీకాలు

మధిర: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, ఇందు కోసం పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని మండల పశువైద్యాధికారి ఉమా కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో సిరిపురం, దెందుకూరు గ్రామాల్లో, 17న దెందుకూరు, మల్లారం, 18వ తారీకు ఖమ్మంపాడు, మల్లారం, 19న ఖమ్మంపాడు, రామచంద్రపురం, 21న ఖమ్మంపాడు జాలిముడి, 22న రొంపిమళ్ల, చిలుకూరు, 23న చిలుకూరు, వంగవీడు, 24న కృష్ణాపురం, తొర్లపాడు, 25న మాటూరు, తొండలగోపారం గ్రామాలు, 26న మాటూరుపేట, రాయపట్నం, 28, 29న సిద్దినేనిగూడెం, రాయపట్నం, 30న నాగవరపాడు, ఇల్లూరు, నవంబర్ 1న నిదానపురం, ఇల్లూరు, 2న మడుపల్లి, దేశినేని పాలెం, 4న మడుపల్లి, ఇల్లెందులపాడు, 5న అల్లినగరం, బయ్యారం, మహాదేవపురం, 6న నక్కలగరుబు, మహాదేవపురం, 7న ఆత్కూరు, మధిర, 8న జిలుగుమాడు, మధిర ఎన్జీవోస్ కాలనీ, 9న మదిర పట్టణం, అంబారుపేట గ్రామాల్లో పశు వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రహదారి పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు

చింతకాని: పందిళ్లపల్లి నుంచి మత్కేపల్లి గ్రామం వరకు నిర్మించనున్న రహదారిని పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మంజూరు చేసిన రూ.8.50 కోట్ల నిధులతో పందిళ్లపల్లి గ్రామంలోని మున్నేరు వద్ద ఉన్న శివాలయం నుంచి మత్కేపల్లి గ్రామంలోని మున్నేరు వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు బీటీ రహదారి నిర్మించనున్నట్లు తెలిపారు.

విద్య ద్వారానే సమాజ మార్పు

కల్లూరు: విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో ఎస్.సతీష్ అధ్యక్షతన నిర్వహించిన నూతన ఉపాధ్యాయుల అభినందన సభలో ఆమె పాల్గొన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు మట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థుల నమోదు పెంపుదలకు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన ఉపాధ్యాయులను అభినందించి వారికి అవసరమైన సర్వీస్ మెటీరియల్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రంజాన్, వీవీ రామారావు, జీఎస్ఆర్ రమేష్, శ్రీనివాసరావు, విజయకుమార్, వీరస్వామి, ప్రసాద్, ఈశ్వరాచారి, సుధీర్, శ్రీనివాస్, చక్రవర్తి, తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకులు ఎస్కే సాధిక్ అలి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన కల్లూరు శాంతినగర్‌కు చెందిన కొత్తపల్లి స్వరూప, తెల్లపుట్ట ఉదయ్‌కిరణ్, నల్లగట్ల మహిత లను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో మాజీ జెడ్పీటీసీ లక్కినేని రఘు, కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, ఈఓ నాగేశ్వరరావు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్, ఖమ్మంపాటి నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఖమ్మంపాటి వీరాస్వామి, వెపెంటయ్య, సుధీర్, సత్యానందం, జయరాజు, అనీల్, శ్రీనివాసరావు, వీరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కాలేజీ నుంచి 21మందికి ఉద్యోగాలు

కల్లూరు: కల్లూరులోని లక్కినేని రామయ్య ప్రతిభ డీఈడీ కళాశాలలో చదివిన 17 మంది ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ శివ నాగరాజు తెలిపారు. అలాగే, బీఈడీ కళాశాల నుంచి నలుగురు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని ప్రతిభా విద్యాసంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్, కరస్పాండెంట్ లక్కినేని రఘు, ప్రిన్సిపాల్ అభినందించారు.

హమాలీలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాయపూడి నారాయణరావు కుమారుడు అయ్యప్ప జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సోమవారం 10 మంది హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు చింతలపూడి వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్, పెనుగొండ ఉపేందర్‌రావు, ఏపూరి రాజారావు, కొల్లా రాంబాబు, చెరుకూరు శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, రాయపూడి వెంకటేష్, కట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామానికి చెందిన మోదుగు సాధన వైద్య విద్యను అభ్యసిస్తుంది. ఆమె చిన్నతనంలోనే తల్లిని కోల్పోగా.. ఇటీవల ఆమె తండ్రి తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. సమాచారం తెలుసుకున్న గుంటుపల్లి గోపవరం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ బాధ్యులు యం.రామ్‌ప్రదీప్, జి.హనుమంతురావులు సోమవారం ఆమెకు వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం రూ.10వేలను అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న ఎంపీడీఓ

ఎర్రుపాలెం: మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివుడు, దినేష్‌లు ఎన్నికయ్యారు. మండల గౌరవ అధ్యక్షుడిగా ఆర్.హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.కుమార్, కోశాధికారిగా గోపిచంద్, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్‌రెడ్డి, పలువురు కార్యదర్శులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎంపీడీఓ సురేందర్, ఎంపీఈఓ శ్రీలక్ష్మి అభినందించారు.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు వెనుకంజ

- దరఖాస్తులు 3,666..
- ఫీజు చెల్లించేందుకు ముందుకు వచ్చింది 41 మందే..



సత్తుపల్లిలో సర్వే చేస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలోని ఖాళీ స్థలాలపై 2020లో ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీంను సద్వినియోగం చేసుకోవటంలో యజమానులు వెనుకంజ వేస్తున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో 3,666 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో పాటు 2020వ సంవత్సరంలో రూ.1,000 చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం ఈ దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకొని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి స్థలం, తాజా పరిస్థితితో పాటు నిబంధనలకు విరుద్ధంగా స్థలాలు ఉన్నాయా అని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. అక్కడికక్కడే జీపీఎస్ ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు ముందుకు వస్తే భవిష్యత్‌లో ఇంటి నిర్మాణం చేసేటప్పుడు కలిగే ప్రయోజనాలను అధికారులు స్థల యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే స్థలాలు అమ్మకాలు, కొనుగోలు చేయటం వల్ల 2020లో దరఖాస్తులు చేసిన లబ్ధిదారులు ప్రస్తుతం ఆ స్థలం వేరే వ్యక్తులు కొనుగోలు చేయటంతో ముందుకు వచ్చేందుకు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఫీజు చెల్లిస్తే..

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినట్లెతై ఆ స్థలంలో భవన నిర్మాణం చేపట్టేటప్పుడు బిల్డింగ్ పర్మీషన్ కోసం దరఖాస్తు చేసిన సందర్భంలో సాధారణంగా వచ్చే బిల్డింగ్ పర్మీషన్ కంటే 50శాతం వరకు ఫీజు తక్కువగా వస్తుంది. అదే విధంగా బ్యాంకుల్లో ప్లాట్‌మీద లోన్ కావాలంటే ఎల్ఆర్ఎస్ అనుమతి పొందిన ప్లాట్‌లకు సత్వరం వచ్చే అవకాశం ఉంది.

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం



సత్తుపల్లిరూరల్: సదాశివునిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



ముదిగొండ: చిరుమర్రిలో.. మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి



కారేపల్లి: మాధారంలో..

సత్తుపల్లిరూరల్/ వేంసూరు/ కల్లూరురూరల్/ చింతకాని/ బోనకల్/ కారేపల్లి/ వైరారూరల్: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. సత్తుపల్లి మండలంలోని సదాశివునిపేట గ్రామంలో, వేంసూరు మండలంలోని బీమవరంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలోని కొర్లగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రారంభించారు. చింతకాని మండలకేంద్రంలో.. ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు ప్రారంభించారు. బోనకల్ మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో.. మండల స్పెషల్ ఆఫీసర్ విజయబాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కారేపల్లి మండలం మాధారంలో ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో.. మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్.. అదే విధంగా వైరా మండలం గన్నవరంలో.. మండల స్పెషలాఫీసర్ కస్తాల సత్యనారాయణ, ముదిగొండ మండలంలోని చిరుమర్రిలో.. మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ, గ్రామాల్లోని రైతులు సంబంధిత అధికారుల ద్వారా పూర్తి సమచారం తెలుసుకొని, కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఏ-గ్రేడ్ సన్న రకం వరి క్వింటాకు రూ.2,320, సీ-గ్రేడ్ 2,300 సన్నాలకు అదనంగా బోనస్ రూ.500 అందిస్తుందని.. రైతులు ఉపయోగించుకోవాలన్నారు. తేమ, చెత్త చెదారం, రాళ్లు లేకుండా క్లీనింగ్ చేసుకుని సీరియల్ ప్రకారం కాంటా వేయించి మిల్లులకు రవాణా చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, డైరెక్టర్ కృష్ణ, రైతులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, నాగబాబు, లక్ష్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివవేణు, ఎంపీడీఓలు శ్రీధర్‌స్వామి, చంద్రశేఖర్, రవికుమార్, చిన్ననాగేశ్వరరావు, ఏపీఎంలు శ్రీనివాసరావు, సుబ్బారావు, పద్మలత, ఏఈఓ ఆశాజ్యోతి, ఐకేపీ సీసీలు సరేందర్‌రెడ్డి, భాస్కర్, అనురాధ, సీసీలు రామారావు, జొనెబోయిన సీతారావమ్మ, తహసీల్దార్లు పున్నం చందర్, సునీత, పులి సాంబశివుడు, శ్రీనివాసరావు, ఎంఏ రాజు, వ్యవసాయాధికారులు ఎం.రూప, విజయబాస్కర్, పల్లెల నాగయ్య, రామ్మోహన్, ఏఓలు మయాన్ మంజుఖాన్, రవిప్రసాద్, ఐకేపీ ఏపీఎంలు వెంకటరామారావు, తిరుమలరావు, ఎంపీఓ రవిప్రసాద్, శాస్త్రీ, చింతకాని సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, ఏపీఓ అనురాధ, అశోక్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ వెంకట కోటారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కృష్ణ, ఏడుకొండలు, ఏఈఓ ప్రకాశం, సీసీ సోందు, సొసైటీ కార్యదర్శులు హన్మంతరావు, కొనుగోలు కేంద్రం కమిటీ సభ్యులు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.